


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 177 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : శ్రీకాకుళం | బుధవారం 8 జూలై 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 177 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : SRIKAKULAM | WED 8 JULY 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



## కొమ్మిడి నర్సింహారెడ్డి మృతి పట్ల కేసీఆర్ విచారం

- రాజకీయాల్లో నీతి, నిజాయతీకి నర్సింహారెడ్డి నిదర్శనంగా నిలిచారన్న కేసీఆర్
- తన వందలాది ఎకరాలను పేదలకు పంచిపెట్టారని కితాబు
- తెలంగాణ సమాజానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని వ్యాఖ్య

- మిగతా 2లో

## ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు.. భారత్‌తో 200 మిలియన్ డాలర్ల డీల్

- ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు విక్రయించేందుకు భారత్ ఒప్పందం
- సుమారు రూ.1900 కోట్లతో డీల్
- ఫిలిప్పీన్స్, వియత్నాం తర్వాత బ్రహ్మోస్ కొన్న మూడో దేశం ఇండోనేషియా
- ఆస్త్రా క్షిపణులు, సాంకేతిక బదిలీపైనా కీలక ఒప్పందాలు
- భారత్, రష్యా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణి అభివృద్ధి

- మిగతా 2లో




## నీటి వాటా కోసం ఎంతకైనా తెగిస్తాం: భారత్‌కు పాక్ సైన్యం వార్నింగ్!

- సింధు జలాల వాటా కోసం అన్ని చర్యలు తీసుకుంటామన్న పాక్ సైన్యం
- నీటి కోసం భారత్‌తో యుద్ధానికైనా సిద్ధమంటూ బిలావల్ భుట్టో వ్యాఖ్యలు
- పహల్గాం దాడి తర్వాత సింధు ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్
- ఉగ్రవాదాన్ని ఆపనంత వరకు ఒప్పందంపై ముందడుగు లేదని కేంద్రం స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:భారత్, పాకిస్థాన్ మధ్య చారిత్రక సింధు జలాల ఒప్పందంపై వివాదం మరింత తీవ్ర రూపం దాల్చుతోంది. ఇప్పటివరకు కేవలం రాజకీయ నాయకులకే పరిమితమైన హెచ్చరికలు, ఇప్పుడు పాక్ సైనిక నాయకత్వం నుంచి కూడా వ్యక్తమవుతున్నాయి. సింధు జలాల్లో తమకు

- మిగతా 2లో






## 'సీఎం విజయ్ పర్యటనలను కూడా మేమే నియంత్రించాలా?'.. డీఎంకేపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- సీఎం విజయ్ కరూర్ పర్యటనపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ డీఎంకే పిటిషన్
- సీఎం పర్యటనలపై ఆంక్షలు విధించాలని విన్నపం
- సాక్షులపై సీఎం ప్రభావం చూపుతారని డీఎంకే వాదన
- రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఎలా ఆదేశాలిస్తామని కోర్టు ప్రశ్న
- కరూర్ తొక్కిసలాట కేసు నేపథ్యంలో పిటిషన్

- మిగతా 2లో



## ఏపీకి పెట్టుబడుల వేట..

### కొరియాలో లోకేశ్ వరుస సమావేశాలు

- దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్ బిజీ బిజీ
- ఎల్జీ, శాంసంగ్, హ్యుందాయ్ మోబిస్ వంటి దిగ్గజ సంస్థలతో భేటీ
- కాకినాడ, విశాఖలో యూనిట్లు, ఈవీ సెమీకండక్టర్ హబ్ ఏర్పాటుకు విజ్ఞప్తి
- ఏపీని ఏఐ-కంప్యూట్ హబ్?గా మార్చాలని శాంసంగ్‌కు ప్రతిపాదన
- క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ఏపీని అగ్రగామిగా నిలపడమే ధ్యేయమన్న లోకేశ్

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఐటీ, ఎల క్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలు

- మిగతా 2లో




- ఏపీకి రూ.9,076 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- మొత్తం 11 ప్రాజెక్టుల ద్వారా 10,531 మందికి ఉద్యోగాలు
- రైతు కుటుంబాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సీఎం
- పర్యాటక రంగం అభివృద్ధికి 100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు
- ఇథనాల్, సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం

వివరాలు 2లో..



## ఈ ఏడాది రాయలసీమకు ఎల్‌నినో దెబ్బ...

### మంత్రి అనిత ఉన్నతస్థాయి సమీక్ష

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. దీని కారణంగా రాష్ట్రంలోని 11 జిల్లాల్లో, ముఖ్యంగా రాయలసీమలో, సాధారణం నుంచి తీవ్రస్థాయిలో వర్షపాతం లోటు నమోదైందని అధికారులు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ)

- మిగతా 2లో

## ఏపీలో హస్తకళల పర్యాటకం.. పవన్ కల్యాణ్ కీలక ప్రకటన

- టెంపుల్ టూరిజం తరహాలో హస్తకళల పర్యాటకం అభివృద్ధి
- కళాకారుల జీవితాలపై ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని ఆదేశం
- ఉప్పాడ చీరలు, అరటి నార వస్తువులు కొనుగోలు చేసిన పవన్
- గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శనలకు ప్రత్యేక ఏర్పాట్లు

- మిగతా 2లో



## భోగాపురం విమానాశ్రయం సిద్ధం.. త్వరలో ప్రారంభం: రామ్మోహన్ నాయుడు

- భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు
- అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి
- మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈరోజు విమానాశ్రయాన్ని

- మిగతా 2లో



## మెల్‌బోర్న్‌లో మోదీ మేనియా..

### భారత ప్రధాని ఈవెంట్‌కు రికార్డు స్థాయి ఏర్పాట్లు

- ఈ వారం ఆస్ట్రేలియాలో పర్యటించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- మెల్‌బోర్న్‌లో జరగనున్న 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు
- ఈవెంట్‌కు 30,000 మంది వస్తారని అంచనా వేస్తున్న అధికారులు
- భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు విలువలపై ఆధారపడ్డవని చెప్పిన హైకమిషనర్
- క్రికెట్‌ను దాటి ఇతర క్రీడల్లోనూ సహకారంపై దృష్టి సారించిన ఇరు దేశాలు



## గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు.. 38 మందికి మరణశిక్ష

- 11 మందికి యావజ్జీవ శిక్ష కొనసాగింపు
- 2008లో జరిగిన పేలుళ్ల ఘటన
- 56 మంది మృతి, 246 మంది గాయాలు
- బాధితులకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశం
- 49 మందిని దోషులు, 28 మందిని నిర్దోషులుగా తేల్చిన వైనం

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

## 'సీఎం విజయ్ పర్యటనలను కూడా మేమే నియంత్రించాలా?'.. డీఎంకేపై సుప్రీంకోర్టు ఆగ్రహం

తమిళనాడు ప్రతిపక్ష పార్టీ డీఎంకేపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి విజయ్ పర్యటనలు, ప్రసంగాలపై ఆంక్షలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి సుప్రీంకోర్టును వేదికగా మార్చొద్దని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలతో డీఎంకే వెనక్కి తగ్గి తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది.కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో ముఖ్యమంత్రి విజయ్ జులై 10న అక్కడ పర్యటించనున్నారని డీఎంకే కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. మృతుల కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలు, ఆర్థిక సాయం అందించే కార్యక్రమం దర్యాప్తులో ఉన్న సాక్షులపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాదించింది. అంతేకాదు టీవీకే నేత ఆదవ్ అర్జున చేసిన వ్యాఖ్యలపైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రసంగాలు, పర్యటనలపై ఆదేశాలు ఇవ్వాలని కోరింది.అయితే ఈ వాదనలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. "ముఖ్యమంత్రి ఏం చేయాలో కూడా సుప్రీంకోర్టే చెప్పాలా? ఆయన ఈ కేసులో నిందితుడు కాదు. స్వేచ్ఛగా మాట్లాడే హక్కుపైనా ఆంక్షలు కోరుతున్నారా? రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఈ కోర్టు ఎలా ఆదేశాలు ఇస్తుంది?" అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో డీఎంకే తన పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి కోరగా కోర్టు అంగీకరించింది.గతేడాది సెప్టెంబరులో కరూర్‌లో విజయ్ ఎన్నికల ప్రచార సభ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. తొక్కిసలాటకు టీవీకే కార్యకర్తల నిర్లక్ష్యమే కారణమని డీఎంకే ఆరోపిస్తుండగా, ఇదంతా డీఎంకే రాజకీయ కుట్రేనని విజయ్, టీవీకే నేతలు ఆరోపిస్తున్నారు.

## కొమ్మిడి నర్సింహారెడ్డి మృతి పట్ల కేసీఆర్ విచారం

తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. రాజకీయాల్లో అత్యంత నిరాడంబరతకు, నీతి, నిజాయతీకి నిదర్శనంగా నిలిచిన ఒక గొప్ప ప్రజల మనిషిని మనం కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సేవలో నర్సింహారెడ్డి చేసిన అపారమైన కృషిని ఈ సందర్భంగా కేసీఆర్ ప్రత్యేకంగా స్మరించుకున్నారు.భూదానోద్యమ సమయంలో తన సొంత వందలాది ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టి నర్సింహారెడ్డి ఆదర్శంగా నిలిచారని కేసీఆర్ కొనియాడారు. 1969లో సాగిన తొలిదశ తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో చురుగ్గా పాల్గొనడమే కాకుండా... మూసీ నది పరిరక్షణ కోసం, తెలంగాణ ప్రాంతానికి గోదావరి నదీ జలాల సాధన కోసం ఆయన చివరి శ్వాస వరకు నిరంతరం కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ సమాజానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. నర్సింహారెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోవడం తీరని లోటు అని అన్నారు. ఆయన మరణంతో శోకసముద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.

## ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు.. భారత్‌తో 200 మిలియన్ డాలర్ల డీల్

రక్షణ రంగ ఎగుమ తుల్లో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఇండోనేషియాకు సుమారు 200 మిలియన్ డాలర్ల (రూ. 1,900 కోట్లు) విలువైన రెండు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్యాటరీలను సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం ఇరు దేశాల మధ్య జరిగిన పలు కీలక రక్షణ ఒప్పందాల్లో భాగంగా ఈ డీల్ ఖరారైంది. ఈ ఒప్పందంతో బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేసిన మూడో విదేశీ కస్టమర్‌గా ఇండోనేషియా నిలిచింది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ మూడు బ్యాటరీల కోసం ఒప్పందం చేసుకోగా, ఈ ఏడాదే వియత్నాం కూడా బ్రహ్మోస్ కొనుగోలుకు అంగీకరించింది. తాజా ఒప్పందంతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ తన రక్షణ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.ఈ డీల్ కేవలం బ్రహ్మోస్ క్షిపణులకే పరిమితం కాలేదు. అస్త్రా ఎయిర్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థలు, కీలకమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, సముద్ర భద్రత వంటి అంశాలపై కూడా ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఇరు దేశాల రక్షణ మంత్రుల సమావేశంలోనే ఈ ఒప్పందాలపై చర్చలు మొదలయ్యాయి.భారత్‌కు చెందిన డీఆర్‌డీవో, రష్యాకు చెందిన ఎన్పీవో మషినోస్ట్రోయెనియా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణిని అభివృద్ధి చేశాయి. ఇది భారత త్రివిధ దళాల్లోనూ సేవలందిస్తోంది. భారత్ మరో అరడజను దేశాలతో బ్రహ్మోస్ అమ్మకాలపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.సాధారణంగా ఒక బ్రహ్మోస్ బ్యాటరీలో 4 లాంచర్లు ఉంటాయి. ఒక్కో లాంచర్ పై 3 రెడీ టు ఫైర్ బ్రహ్మోస్ క్షిపణులు ఉంటాయి. ఆ లెక్కన ఒక బ్యాటరీలో మొత్తం 12 క్షిపణులు ఉంటాయి. వీటిని కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు.

## ఏపీకి పెట్టుబడుల వేట..

### కొరియాలో లోకేశ్ వరుస సమావేశాలు

- మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నారు.
సియోల్‌లో ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్-జు కోహ్?తో లోకేశ్ భేటీ అయ్యారు. కాకినాడ పోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రాన్ని, మూలపేటలో ప్రపంచస్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. అలాగే, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ సీఈవో ల్యూ జె చెయోల్‌తో సమావేశమై... విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్‌తో సమావేశమైన లోకేశ్, ఏపీలో ఈవీ సెమీకండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో భేటీ సందర్భంగా... ఏపీని డేటా సెంటర్లు, సర్వర్ తయారీకి భారతదేశపు స్థావరంగా మార్చాలని ప్రతిపాదించారు.ఈ సందర్భంగా క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 150 క్యూబిట్‌ల క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు నుంచి, దాని తయారీ వరకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఈ బిజీ షెడ్యూల్ మధ్య ఆయన ఎల్జీ సైన్స్ పార్క్ లో రోబోతో ఫొటో దిగారు.

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ.. ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టులు ఇవే!

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 9,076.11 కోట్ల విలువైన 11 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 10,531 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కలగనున్నాయి.
ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రైతు కుటుంబాలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా పారిశ్రామికీకరణ జరగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో ఇథనాల్‌కు డిమాండ్ పెరగనున్న నేపథ్యంలో, ఆ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. దీనివల్ల మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి ఒక ప్రత్యేక పాలసీని రూపొందించాలని ఆదేశించారు. పర్యాటక రంగంలో ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100 పర్యాటక ప్రాంతాల్లో 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు' ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పోలవరం, గండికోట, లంబసింగి వంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో సోలార్ సెల్స్ తయారీలో ఏపీని అగ్రగామిగా నిలపాలని, పెండింగ్‌లో ఉన్న 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు.
ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**SIPB ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టుల వివరాలు:**

1. డీఎస్ఆర్ హాస్పిటాలిటీ: నెల్లూరులో రూ. 139.92 కోట్లతో 4-స్టార్ హోటల్ (180 మందికి ఉపాధి).
2. మాధవి లీజర్ అండ్ స్టేస్: కడపలో రూ. 52.10 కోట్లతో 3-స్టార్ హోటల్ (400 మందికి ఉపాధి).
3. శ్రీనివాసం అమ్యూజ్‌మెంట్: కడపలో రూ. 68.69 కోట్లతో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ (690 మందికి ఉపాధి).
4. వజ్ర హాస్పిటాలిటీ: విజయవాడలో రూ. 62.40 కోట్లతో హోటల్, బ్యాంక్వెట్ సెంటర్ (450 మందికి ఉపాధి).
5. నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్: తిరుపతి జిల్లాలో రూ. 255 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (400 మందికి ఉపాధి).
6. అక్షత్ గ్రీన్‌టెక్: అనకాపల్లి జిల్లాలో రూ. 1,600 కోట్లతో సోలార్ సెల్, మాడ్యూల్ యూనిట్ (750 మందికి ఉపాధి).
7. బెర్రీ అలాయ్స్: బొబ్బిలిలో రూ. 1,200 కోట్లతో మాంగనీస్ సిన్టర్ ప్లాంట్ (831 మందికి ఉపాధి).
8. జియో మైసూర్ ఇండియా: కర్నూలు జిల్లా తుగ్గలిలో రూ. 689 కోట్లతో స్వర్ణగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ (1,750 మందికి ఉపాధి).
9. ఈకో బాక్స్ ఇండస్ట్రియల్స్ (గూగుల్ వేర్‌హౌస్ పార్ట్‌నర్స్): విశాఖలో రూ. 1,008 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (5,000 మందికి ఉపాధి).
10. అదానీ ఫౌండేషన్: విశాఖ జిల్లా కపులుప్పాడలో రూ. 2,200 కోట్ల ప్రాజెక్టు.
11. మోండెలీజ్ ఇండియా ఫుడ్స్: శ్రీ సిటీలో రూ. 1,801 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ (80 మందికి ఉపాధి).

గత రెండేళ్లలో ఇప్పటివరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా, మొత్తం 339 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రాష్ట్రానికి రూ. 11.86 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.41 లక్షల ఉద్యోగాలు రానున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తాజా నిర్ణయాలతో పారిశ్రామికంగా రాష్ట్రం మరింత బలోపేతం కానుంది.

## ఏపీలో హస్తకళల పర్యాటకం.. పవన్ కల్యాణ్ కీలక ప్రకటన

ఆంధ్రప్రదేశ్‌లో ఆధ్యాత్మిక, పర్యావరణ పర్యాటకం తరహాలోనే 'హస్తకళల పర్యాటకాన్ని' కూడా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. మంగళవారం విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆంధ్రప్రదేశ్ హస్తకళల ఉత్సవం 2026'ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్న కళాకారులను గుర్తించి, వారిని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. కళాకారుల జీవన విధానం, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. క్లస్టర్ల వారీగా ఉమ్మడి సౌకర్య కేంద్రాలను (కామన్ ఫెసిలిటీ సెంటర్లు) ఏర్పాటు చేస్తామని, చేతివృత్తుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అలాగే, కళాకారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.
అనంతరం, ఉత్సవం ప్రాంగణంలోని స్టాళ్లను సందర్శించిన పవన్ కల్యాణ్ కళాకారులతో ముచ్చటించారు. కాకినాడ తోలుబొమ్మలాట, ఉప్పాడ జామ్దానీ చీరలు, కలంకారీ కళాఖండాలు, తిరుపతి కొయ్యబొమ్మలు, నరసాపురం లేస్ ఉత్పత్తులతో పాటు అరటి నారతో రూపొందించిన వస్తువులను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్వయంగా కొన్ని ఉప్పాడ చీరలను, అరటి నారతో చేసిన హ్యాండ్‌బ్యాగ్‌ను కొనుగోలు చేసి కళాకారులను వ్యక్తిగతంగా అభినందించారు.
రామాయణ, మహాభారత ఘట్టాలను ప్రతిబింబిస్తూ సాగిన తోలుబొమ్మలాట ప్రదర్శన పవన్ కల్యాణ్‌ను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రాచీన కళకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు, రాబోయే గోదావరి పుష్కరాల సమయంలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఆయన కళాకారులకు హామీ ఇచ్చారు.

# మెల్‌బోర్న్‌లో మోదీ మేనియా..

## భారత ప్రధాని ఈవెంట్‌కు రికార్డు స్థాయి ఏర్పాట్లు

ప్రధాని నరేంద్ర మోదీ ఈ వారాంతంలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జూలై 9న జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' ప్రవాస భారతీయ కార్యక్రమానికి రికార్డు స్థాయిలో జనం హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ పర్యటనపై ఆస్ట్రేలియాలోని భారత సమాజంలో విపరీతమైన ఉత్సాహం నెలకొంది.ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాలోని భారత హైకమిషనర్ నగేష్ సింగ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పర్యటనకు సంబంధించిన కీలక విషయాలు వెల్లడించారు. "ప్రధాని మోదీకి ఇక్కడ విపరీతమైన ఆదరణ ఉంది. మార్వెల్ ఎరీనాలో జరిగే ఈవెంట్‌కు 25,000 నుంచి 30,000 మంది హాజరవుతారని భావిస్తున్నాం. కానీ డిమాండ్ చాలా ఎక్కువగా ఉంది. ఆస్ట్రేలియాలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. పరిమిత స్థలం కారణంగా చాలా మందికి అవకాశం కల్పించలేకపోయాం" అని ఆయన వివరించారు.కొన్నేళ్ల క్రితం సిడ్నీలో జరిగిన ఇలాంటి కార్యక్రమంలో నాటి ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్, మోదీని 'ది బాస్' అని సంబోధించిన విషయాన్ని నగేష్ సింగ్ గుర్తుచేశారు. ఈసారి మెల్‌బోర్న్ ఈవెంట్ అంతకుమించి విజయవంతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోదీతో పాటు ఆస్ట్రేలియా ప్రధాని కూడా ప్రసంగిస్తారని తెలిపారు.
భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ వంటి విలువలపై ఆధారపడ్డవని, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్‌ను ఇరు దేశాలు కోరుకుంటున్నాయని సింగ్ అన్నారు. పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు వార్షిక సదస్సులో పాల్గొంటారు. అదేవిధంగా, క్రికెట్‌ను దాటి ఇతర క్రీడల్లోనూ సహకారాన్ని విస్తరించాలని రెండు దేశాలు భావిస్తున్నట్లు తెలిపారు. క్రీడా విజ్ఞానం, సాంకేతికత, నిర్వహణ వంటి అంశాల్లో పరస్పరం సహకరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.భారత్-ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాలు చాలా బలంగా ఉన్నాయని, దానిని 'క్వాడ్' కూటమితో పోల్చడం సరికాదని నగేష్ సింగ్ స్పష్టం చేశారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారం గణనీయంగా పెరుగుతోందని, క్వాడ్ అనేది నాలుగు దేశాలతో కూడిన ప్రత్యేక ఏర్పాటు అని ఆయన వివరించారు.

# ఈ ఏడాది రాయలసీమకు ఎల్‌నినో దెబ్బ...

- మొదటి పేజీ తరువాయి

ప్రధాన కార్యాలయంలో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నైరుతి రుతుపవనాల పనితీరు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ఈ సమావేశంలో చర్చించారు.ఎల్‌నినో కారణంగా రాయలసీమ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు సమావేశంలో గుర్తించారు. ముఖ్యంగా శ్రీ సత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో తీవ్ర వర్షాభావం ఉండగా.. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణ లోటు నమోదైనట్లు అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో కరవు పీడిత మండలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి అనిత అధికారులను ఆదేశించారు.మరోవైపు, విపత్తుల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.
పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ వంటి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని, పోలీస్, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, ఏపీఎస్డీఆర్ఎఫ్ బృందాలు అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని మంత్రి అనిత దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో ఏపీఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయం సిద్ధం.. త్వరలో ప్రారంభం: రామ్మోహన్ నాయుడు

- మొదటి పేజీ తరువాయి

సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు.
ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

## గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు.. 38 మందికి మరణశిక్ష

2008లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌ను వణికించిన వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు గతంలో విధించిన 38 మంది దోషులకు మరణశిక్షను సమర్థించింది. మరో 11 మందికి జీవిత ఖైదు శిక్షను ఖరారు చేసింది. ఈ పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోగా.. 246 మంది గాయపడ్డారు. బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.
మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 5 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ. 1 లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ మొత్తం 2027 మార్చి 31లోపు చెల్లించాలని ఆదేశించింది. 2008 జులై 26న అహ్మదాబాద్‌లో పలు ప్రాంతాల్లో వరుస పేలుళ్లు జరిగాయి. రెండు రోజుల తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలపై నమోదైన 35 కేసులను కలిపి ఒకే విచారణగా చేపట్టారు.
దర్యాప్తులో వంద మందికిపైగా నిందితులను గుర్తించగా, 78 మందిపై విచారణ జరిగింది. 2022 ఫిబ్రవరిలో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి 28 మందిని నిర్దోషులుగా ప్రకటించింది. స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి) మాజీ నాయకుడు సఫ్దర్ నాగోరి కూడా దోషుల్లో ఒకడు. సిమికి చెందిన కొందరు సభ్యులు కలిసి ఇండియన్ ముజాహిదీన్ పేరుతో కొత్త సంస్థ ఏర్పాటు చేసి ఈ దాడులకు పాల్పడినట్లు పోలీసులు ఆరోపించారు. హత్య, హత్యాయత్నం, దేశంపై యుద్ధానికి యత్నం, దేశద్రోహం, ఉగ్రవాద కార్యకలాపాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలు, పేలుడు పదార్థాల చట్టం తదితర కేసుల్లో నిందితులు దోషులుగా తేలారు.ఈ కేసు విచారణ దాదాపు పదేళ్లకు పైగా సాగింది. తొమ్మిది మంది న్యాయమూర్తుల ఎదుట 1,163 మంది సాక్షులను విచారించారు. వీరిలో 26 మంది కీలక సాక్షుల వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచారు. పేలుళ్ల తర్వాత పంపిన ఈ-మెయిళ్లలో 2002 గోద్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు పేర్కొన్న విషయం కూడా విచారణలో ప్రస్తావనకు వచ్చింది.

## నీటి వాటా కోసం ఎంతకైనా తెగిస్తాం: భారత్‌కు పాక్ సైన్యం వార్నింగ్!

- మొదటి పేజీ తరువాయి

న్యాయబద్ధంగా రావాల్సిన నీటి వాటాను దక్కించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పాకిస్థాన్ సైన్యం తీవ్రంగా హెచ్చరించింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న సంబంధాలను మరింత జఠిలం చేస్తోంది.పాక్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అధ్యక్షతన జరిగిన 276వ కోర్ కమాండర్ల ఉన్నత స్థాయి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ ప్రభుత్వ ఆదేశాలకు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సింధు జలాల్లో తమ హక్కును కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నామని సైన్యం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం లేదా మళ్లించడాన్ని 'యుద్ధ చర్య'గా పరిగణిస్తామని గత ఏడాది ఏప్రిల్ 24న పాక్ జాతీయ భద్రతా కమిటీ (ఎన్ఎస్‌సీ) చేసిన తీర్మానాన్ని ఈ సమావేశంలో పునరుద్ఘాటించారు. దేశ సన్నద్ధత, వృత్తి నైపుణ్యం పట్ల సమావేశం సంతృప్తి వ్యక్తం చేసింది.
మరోవైపు, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) చైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ కూడా భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సింధు నది జలాలను భారత్ ఒక 'ఆయుధం'గా మార్చుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నీటి హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అవసరమైతే భారత్‌తో యుద్ధం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. సైనిక సమావేశంలో ఆఫ్ఘన్ గడ్డపై నుంచి పాక్‌లో జరుగుతున్న ఉగ్రదాడులపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. కశ్మీరీలకు తమ నైతిక, రాజకీయ మద్దతు కొనసాగుతుందని పునరుద్ఘాటించారు.గత ఏడాది పహల్గాంలో 26 మంది మృతికి కారణమైన భీకర ఉగ్రదాడి తర్వాత, దానికి ప్రతీకార చర్యగా 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్థాన్ శాశ్వతంగా, విశ్వసనీయంగా స్వస్తి పలికేంత వరకు ఈ ఒప్పందంపై ముందుకు వెళ్లేది లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. క్షేత్రస్థాయి వాస్తవాలకు విరుద్ధంగా ఒప్పందాలు ఒంటరిగా మనుగడ సాగించలేవని భారత్ స్పష్టం చేసింది.ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960లో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం, తూర్పు నదులైన రావి, సట్లెజ్, బియాస్‌పై భారత్‌కు, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్‌పై పాకిస్థాన్‌కు నియంత్రణ ఉంటుంది. ఒప్పందం నిలిచిపోవడంతో, రుతుపవనాల సమయంలో పాక్‌తో వరద సమాచారాన్ని పంచుకోవాల్సిన బాధ్యత భారత్‌కు లేకుండా పోయింది. ఇదే సమయంలో భారత్.. సింధు నదీ బేసిన్‌లో సావల్‌కోట్, రాటిల్, బుర్సార్ వంటి పలు జలవిద్యుత్ ప్రాజెక్టులను వేగవంతం చేస్తోంది. పాకిస్థాన్ వ్యవసాయంలో 80-90 శాతం సింధు నదీ వ్యవస్థపైనే ఆధారపడి ఉంది. ఆ దేశంలోని ప్రధాన జలాశయాలైన టార్బెలా, మంగ్లా డ్యామ్‌లలో నీటి నిల్వలు అడుగంటినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఒకప్పుడు సాంకేతిక ఒప్పందంగా ఉన్న సింధు జలాల అంశం ఇప్పుడు ఇరు దేశాల మధ్య కీలకమైన వ్యూహాత్మక ఒత్తిడి కేంద్రంగా మారింది.

## ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణం - పట్టు తప్పితే గాల్లో ప్రాణం





- ఉబ్బెంగుల, దొరగూడ ప్రజల కష్టాలు వర్ణనాతీతం.
- వంతెన నిర్మించాలని వేడుకుంటున్న గిరిజనులు - పట్టించుకోని అధికారులు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 07.** అల్లూరి జిల్లా మారుమూల ముంచంగిపుట్టు మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. రహదారి లేకపోవడంతో గిరిజన ప్రజలకు ఉదృతంగా ప్రవహిస్తున్న వాగు నుంచి ప్రమాదం పొంచి ఉంది. అయినా గత్యంతరం లేని పరిస్థితుల్లో వాగు గెడ్డల నుంచే ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఉదృతంగా ప్రవహిస్తున్న గెడ్డ నుంచి ఈదుకుంటూ ఒకరికొకరు సహకారం అందించుకుంటూ ఒడ్డున చేరుతున్నారు. వివరాల్లోకెళ్ళితే.. మండలంలో గల మారుమూల లక్ష్మీపురం పంచాయతీలో ఉబ్బెంగుల, దొరగూడ ప్రజలకు ఈ దుస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలు కావడి చేసి గెడ్డ దాటిస్తున్న పరిస్థితులు అందరిని కదిలిస్తున్నాయి. రహదారి లేకపోవడంతో ప్రాణాలను పణంగా పెట్టి గెడ్డలో ప్రయాణం చేస్తూ, తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. గెడ్డలో అదుపు తప్పితే చాలు ప్రాణము గాల్లో కలిసిపోయే ప్రమాదం పొంచి ఉందని ఆయా గ్రామస్తులు వంతాల గురుమూర్తి, వంతాల సద్దు, వంతాల రంపన్, వంతాల సుబ్బారావు, కిలో రాజు తెలిపారు. ప్రభుత్వానికి వంతెన నిర్మాణం కొరకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించిన సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులను అడిగితే వంతెన నిర్మాణాలకు టెండర్ ప్రక్రియ పూర్తి అయిందని, త్వరలోనే తుమ్మిడి పుట్టు, కర్లపొదొర్, ఉబ్బెంగుల వంతెనాల నిర్మాణం చేపడతారని చెబుతూ.. కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గెడ్డ పొంగి ప్రవహిస్తున్నప్పుడు తప్పని పరిస్థితుల్లో రాకపోకలు కొనసాగించాల్సి వస్తుందని, పంచాయతీ కేంద్రానికి వెళ్లాలన్న, మండల కేంద్రానికి వెళ్లాలన్న గెడ్డ దాటక తప్పడం లేదని వారు తెలిపారు. వంతేన లేకపోవడంతో నిత్యవసరాలు, అత్యవసర వైద్యం కోసం ప్రాణాలను అర చేతులో పెట్టుకుని ఉధృతంగా ప్రవహించే వాగులో ఈదక తప్పటం లేదని వారు ఈ దుర్భార పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఉబ్బెంగులలో సుమారు 130 మంది, దొరగూడలో సుమారు 70 మంది ప్రజలు నివసిస్తున్నట్లు వారు తెలిపారు. పూట గడవాలంటే ఈ గెడ్డలను దాటక తప్పని పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# జోరుగా ఆక్రమ కట్టడాలు.



**అరకులోయ పెన్ పవర్ జూన్ 7:** అరకులోయ మండలంలో రోజురోజుకి ఆక్రమ కట్టడాల జోరు అధికమవుతుందని పలు సంఘాల నాయకులు నుంచి విమర్శలు వెల్లి వెతుకుతున్నాయి. రిసార్ట్స్ లకు అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా చేసుకుంటున్న బినామీ దారులు. అరకులోయ మండల కేంద్రంలో పంచాయతీ, రెవెన్యూ అనుమతులు లేకుండా గిరిజనేత్రులు దర్జగా నిర్మాణాలు చేపట్టిన రెవెన్యూ అధికారులకు పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా లెక్క చేయకుండా నిర్మాణాలు గిరిజనులను అడ్డుపెట్టి దర్జాగా చేసుకుంటున్న బినామీ దారులు గిరిజనేత్రులు వీటిపై పంచాయతీ రెవెన్యూ అధికారులకు వివరాలు అడగగా నోటీసులు జారీ చేశాము నిర్మాణాలకు సంబంధించిన పేపర్స్ కార్యాలయాలకు పట్టుకొచ్చి చూపించడని నోటీసుల్లో ఉన్నా, నోటీసులు జారీ చేసిన తర్వాత రెండు మూడు రోజులు పనులు నిలుపుదల చేసి మూడు రోజుల తర్వాత మామూలే వారి పని వారు చేసుకుంటున్నారు. అయితే పంచాయితీ రెవెన్యూ అధికారులకు చేతులు తడిపుతుండటంతో బినామీదారులు బినామీ దారులు గిరితినేత్రులు దర్జాగా నిర్మాణాలు చేసుకుంటున్నారంటూ మండలంలో గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు అనుమానం వ్యక్తపరుస్తున్నారు.. డ్రైనేజీపై గిరిజనేత్రుడు చిన్న గుడిసె కట్టుకొని మదుపు పెట్టిన వాడు దొరకడంతో ఆ చిన్న గుడిసె ఇప్పుడు బహుళ అంతస్తుకు పడగలెత్తుతోంది. దీనిపై రెవెన్యూ, పంచాయతీ ఆధికారులు ఎటువంటి అనుమతులు లేకుండా పచ్చటి క్లాత్ కప్పేసి పనులు దర్జాగా చేసుకుంటున్నారు.. హెర్మోను మందిరం రోడ్లో ఓ బినామి గృహం గుట్టు చప్పుడు కాకుండా ముందు భాగం తీయకుండా వెనక భాగంలో గృహ నిర్మాణం పనులు శరవేగంగా చేసుకుంటున్నారు. దీనికి కూడా పంచాయతీ, రెవెన్యూ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా నిర్మాణ పనులు చేసుకుంటున్నారు. పద్మాపురం మేజర్ పంచాయతీ అయినా రణజిల్లెడ గ్రామంలో ఓ గిరిజనుడు భూమిలో ఓ బినామి దారుడు బహుళ అంతస్తులకు ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు శరవేగంగా చేసుకుంటున్న పద్మాపురం పంచాయతీ సెక్రెటరీకి వివరణ కోరగా నోటీసులు ఇవ్వడం జరిగింది తెలిపి చేతులు దులుపుకుంటున్నారు. ఈ నిర్మణాలు పై జిల్లా అధికారులు తక్షణమే ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిర్మాణాలు చేస్తున్న వారిని డాక్యుమెంట్స్ తనిఖీ చేసి ఆ భవనాలను నిలిపివేయాలని పలు గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేన్నాయి. తక్షణమే జిల్లా యంత్రాంగం ఈ నిర్మాణాలు పై నిర్మాణాలకు సంబంధించిన డాక్యుమెంట్స్ తనిఖీలు చేసి తగు చర్యలు తీసుకోవాలని వన్ బై సెవెంటీ చట్టానికి పట్టిష్టంగా అమలు చేయాలని గిరిజన సంఘాలు ప్రజా సంఘాలు తెలుపుతున్నారు.

# మూడు రోజుల్లో రెండు లాడ్జిలపై మెరుపు దాడులు

- అసాంఘిక కార్యకలాపాలపై గోపాలపట్నం పోలీసుల ఉక్కుపాదం
- రాయల్ ఇన్, ఏబీసీ లాడ్జిలపై ఆకస్మిక తనిఖీలు
- నిర్వాహకులపై కేసులు -- లాడ్జిల సీజ్ ప్రక్రియ ప్రారంభం
- చట్టాన్ని అతిక్రమిస్తే ఎవరినీ ఉపేక్షించం
- లాడ్జ్ యజమానులకు గోపాలపట్నం సీఐ సన్యాసినాయుడు గట్టి హెచ్చరిక

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 7 :** నగరంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న లాడ్జిలపై గోపాలపట్నం పోలీసులు కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. వరుసగా మూడు రోజుల వ్యవధిలో రెండు లాడ్జిలపై మెరుపు దాడులు నిర్వహించి, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, సంబంధిత లాడ్జిలను చట్టపరంగా సీజ్ చేసే ప్రక్రియను ప్రారంభించారు. నేరాల నిర్మూలనలో రాజీ పడబోమనే సందేశాన్ని ఈ చర్యల ద్వారా పోలీసులు స్పష్టం చేశారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని బాజీ జంక్షన్ సమీపంలోని రాయల్ ఇన్ లాడ్జ్, సప్తగిరి జంక్షన్ వద్ద ఉన్న ఏబీసీ లాడ్జ్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందాలతో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిన పోలీసులు, అక్కడ జరుగుతున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టారు. దర్యాప్తులో అమాయక వ్యక్తులను ప్రలోభపెట్టి అసాంఘిక కార్యకలాపాలకు లాడ్జిలను వినియోగిస్తున్నట్లు తేలడంతో మనీ, జ్యోత్స్న, కిరణ్, జయంత్, అశోక్ అనే నిర్వాహకులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేశారు. నిబంధనలను ఉల్లంఘించి నేరాలకు కేంద్రాలుగా మారిన లాడ్జిలపై చట్టపరమైన చర్యల్లో భాగంగా సీజ్ ప్రక్రియను కూడా ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. లాడ్జ్ యజమానులు తమ సంస్థల్లో జరిగే ప్రతి కార్యకలాపంపై పూర్తి బాధ్యత వహించాలని పోలీసులు స్పష్టం చేశారు. వ్యాపార ప్రయోజనాల కోసం చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అవకాశం కల్పించడం తీవ్రమైన నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే లాడ్జిల లైసెన్సులు రద్దు చేయడం, సీజ్ చేయడం వంటి చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు గోపాలపట్నం పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, వ్యభిచారం, మాదకద్రవ్యాల వినియోగం లేదా ఇతర చట్టవ్యతిరేక చర్యలకు సంబంధించి ఎక్కడైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. నేరాలకు వేదికగా మారుతున్న లాడ్జిలు, గెస్ట్ హౌస్‌లు, అద్దె గదులు, ఇతర వాణిజ్య సంస్థలపై ఇకపై నిరంతర తనిఖీలు కొనసాగుతాయని గోపాలపట్నం పోలీసులు స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించి అసాంఘిక కార్యకలాపాలకు సహకరించే వారిపై రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, నగరంలో శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని పోలీసులు పేర్కొన్నారు.




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గిరిజన విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ

**పాడేరులో పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూలై 7:** గిరిజన ప్రాంత విద్యార్థుల్లో ఆత్మరక్షణ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించేందుకు ప్రత్యేక సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు పాండు కరాటే అకాడమీ--ఇంటర్నేషనల్ కోఫుకాన్ కరాటే క్లబ్ ఇండియా ఆధ్వర్యంలో పాడేరు మండలంలోని శ్రీకృష్ణాపురం, గుత్తులాపుటు పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ టి నిశాంతి, జాయింట్ కలెక్టర్ శ్రీ పూజ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పాండు కరాటే అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ బాకూరు పాండు రాజు మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులకు ఆత్మరక్షణ విద్యతో పాటు ధైర్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ అలవడేలా ఈ శిక్షణ దోహదపడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఎం. దీప్తిక, విద్యార్థినులు పి. జాహ్నవి, పి. భాగ్యశ్రీ పాల్గొన్నారు.



## ఏఎన్ఎం. జిఎన్ఎమ్ మరియు ఆసాలను పర్మినెంట్ పోస్టుల భర్తీలో ఆశలకు ప్రాధాన్యత కల్పించండి..!

- 31న కలక్టరేట్ వద్ద జరిగే ధర్నా విజవంతం చేయాలి.!
- ఆశ,సీహెచ్,డబ్ల్యు లకు కనీసవేతనం చెల్లించాలి.!
- సీఐటీయు హుకుంపేట మండల కమిటీ డిమాండ్.



**హుకుంపేట పెన్ పవర్ జూన్ 7 :**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్,సీఐటీయూ పిలుపుమేరకు ఈనెల 31న రాష్ట్ర వ్యాప్తంగా,కలెక్టర్ల వద్ద ధర్నాకు పిలుపునిచ్చింది అందులో బాగంగా,మండలానికి చెందిన ఆశ, సీహెచ్ డబ్ల్యు లు పెద్దఎత్తున పాల్గొవాలని కోరుతూ సీఐటీయూ నాయకులు కృష్ణారావు ఆశ లకు మరియు సీహెచ్ డబ్ల్యు లకు కరపత్రాలు పంపిణీ చేసి పిలుపునిచ్చినట్టు పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఈ సందర్భంగా అయన మీడియాతో మాట్లాడుతూ 2026 మార్చి 5న ప్రభుత్వం ఇచ్చిన హామీల సర్క్యులర్స్, జీఓ లను విడుదల చేయాలని, ఆశ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ కు కనీస వేతనం 26వేలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు,అన్నిరకాల సెలవులు ఇవ్వాలన్నారు,పనిభారం తగ్గించాలన్నారు, కాళి పోస్టులు బర్తీ చేయాలన్నారు,పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశల సంఖ్యను పెంచాలన్నారు. ఏఎన్ఎమ్,జిఎన్ఎం పర్మినెంట్ పోస్టుల భర్తీలో వారికి ప్రాధాన్యత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.పై డిమాండ్ల సాధనకు జులై 31న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్స్ వద్ద స్కీమ్ వర్కర్స్ ధర్మాలలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పూపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ఆశలు సీహెచ్ డబ్ల్యు లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణకు ప్రజలందరూ భాగస్వాములు కావాలి....

- జాతీయ డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా నాతవరంలో అవగాహన ర్యాలీ.....
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నకుమార్....




**నాతవరం,పెన్ పవర్ (జూలై 07):** జాతీయ డెంగ్యూ మాసోత్సవం--2026 కార్యక్రమాల్లో భాగంగా నాతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం డెంగ్యూ వ్యాధి నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.ర్యాలీని వైద్యాధికారి డా. కె.డి.హెచ్. ప్రసన్న కుమార్ జెండా ఊపి ప్రారంభించారు.ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు,గ్రామ ఆరోగ్య సిబ్బంది,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని డెంగ్యూ నివారణపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డా.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని,ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి వారం ఒకరోజు "డ్రై డే" పాటిస్తూ నీటి నిల్వ పాత్రలను పూర్తిగా శుభ్రం చేయాలని,దోమలు పెరిగే ప్రదేశాలను తొలగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.జ్వరం,తీవ్రమైన తలనొప్పి,కళ్ల వెనుక నొప్పి,ఒంటి నొప్పులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.డెంగ్యూ నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేలు,దోమల నివారణ కార్యక్రమాలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ కె.వి. రమణ,పీహెచ్ఎన్ త్రివేణి, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సర్వే విజయవంతానికి కార్యకర్తలు కృషి చేయాలి

- గూడెం కొత్తవీధిలో తెదేపా బూత్ కమిటీలతో గిడ్డి ఈశ్వరి సమావేశం





**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 7:** ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పాడేరు నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి సూచించారు.మంగళవారం గూడెం కొత్తవీధి మండలంలో పర్యటించిన ఆమె, మండలంలోని 16 పంచాయతీలకు చెందిన 56 బూత్ కమిటీల సభ్యులు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించి, ప్రతి బూత్ కమిటీ తమ పరిధిలోని అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ ఒక్క అర్హుడి పేరు కూడా ఓటరు జాబితాలో మిస్సవకుండా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని, కొత్తగా అర్హత పొందిన వారి పేర్ల నమోదుతో పాటు తప్పులు, లోపాలు ఉంటే వాటిని సరిచేసేలా సహకరించాలని సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం రానున్న రోజుల్లో పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై నిర్వహించే క్షేత్రస్థాయి కార్యాచరణపై బూత్ కన్వీనర్లు, సభ్యులకు దిశానిర్దేశం చేశారు. అలాగే బూత్‌ల పరిధిలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.గిడ్డి ఈశ్వరి పర్యటనతో మండలంలోని తెదేపా శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా గూడెం కొత్తవీధి ఎంపీటీసీ పసుపులేటి నాగమణి, మండల అధ్యక్షుడు కొండలరావు ఆధ్వర్యంలో ఆమెకు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నలిని, పీఏసీఎస్ చైర్మన్ నూకరాజు, నాయకులు దేశగిరి గోవిందరావు, కంకిపాటి గిరిప్రసాద్, మామిడి చంటిబాబు, రామారావు, పాండురాజు తదితరులు, స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల సమావేశంలో ఎన్యుమరేషన్ ఫారాలపై అవగాహన

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 7:** మండల పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఐదు పంచాయతీలకు చెందిన ఆశా వర్కర్లతో విస్తృత స్థాయి సమావేశాన్ని తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ప్రతి ఒక్కరూ ఎన్యుమరేషన్ ఫారం (ఈఎఫ్)ను తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. ఆశా వర్కర్లు తమతో పాటు తమ కుటుంబ సభ్యుల ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా భర్తీ చేసి, సంబంధిత బీఎల్ఓలకు వెంటనే సమర్పించాలని కోరారు.సమీక్ష సందర్భంగా ఐదు పంచాయతీలకు చెందిన 10 మంది ఆశా వర్కర్లు ఇప్పటివరకు తమ ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించలేదని గుర్తించారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ, ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే ఫారాలను పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించకుండా గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఐదు పంచాయతీలకు చెందిన ఆశా వర్కర్లు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## గాజువాక సబ్ రిజిస్ట్రార్ కు దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం వినతి



**గాజువాక :పెన్ పవర్,జూలై 07**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయము పట్ల గౌరవం మరియు బాధ్యతతో వ్యవహరిస్తూ, ప్రజలు స్థిరాస్తుల విషయం వారికి అనేక సలహాలు సూచనలు ఇస్తూ రిజిస్ట్రేషన్ వ్యవహారములు జరుపుటకు అవసరమగు యావత్తు పనులు ప్రభుత్వం వారి నిబంధనలు అనుసరించి చేస్తూ వారు మా సేవలకు చెల్లించే పైకం తో జీవనం సాగిస్తున్నారని, ప్రస్తుతం ప్రభుత్వం వారు జారీ చేసిన జి.ఓ నెంబర్ 396 ప్రకారం ప్రతి రిజిస్ట్రార్ కార్యాలయం నందు రిజిస్ట్రేషన్ల సేవా కేంద్రాలు ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయుట వలన ప్రజలు ఆస్తుల భద్రతకు మరియు గోప్యతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున మరియు ఎంతో కాలముగా ఈ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న దస్తావేజు లేఖర్ల, వారి సహాయకులు, డి టి పి ఆపరేటర్లు మరియు స్టాంపు వెండర్లు జీవనోపాధి కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉన్నది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ విశాఖపట్నం అర్బన్ దస్తావేజు లేఖరులు సంక్షేమ సంఘం పిలుపు మేరకు జూలై 06 తేదీ సోమవారం నుండి జూలై 07 తేదీ మంగళవారం పెన్ డౌన్ చేసి ఎట్టి రిజిస్ట్రేషన్ వ్యవహారాలు చెయ్యకుండా తమ నిరసనను తెలియజేశారు. అధికారులు తమ నిరసనకు సహాయ సహకారములు అందించాల్సిందిగా కోరారు.

## ఏబులంలో ఎస్ఐఆర్ సర్వే పరిశీలన



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 7:** మండల పరిధిలోని ఏబులం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని డిప్యూటీ తహసీల్దార్ దుమతి సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో జరుగుతున్న ఎన్యుమరేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అంగన్‌వాడీ, వెలుగు సిబ్బందితో కలిసి రికార్డులను తనిఖీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని, సర్వేను పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.అనంతరం గ్రామస్తులతో మాట్లాడి ఎన్యుమరేషన్ ఫారాల నమోదు, ఓటరు వివరాలపై ఆరా తీశారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో అశోక్, అంగన్‌వాడీ కార్యకర్త సాగిన భవాని, వెలుగు కార్యకర్త తగ్గి జయతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ

**పాడేరులో పోస్టర్‌ను ఆవిష్కరించిన ఐటీడీఏ పిఒ ఆదిత్య వర్మ**



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూలై 7:** గిరిజన ప్రాంత విద్యార్థుల్లో ఆత్మరక్షణ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించేందుకు ప్రత్యేక సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు పాండు కరాటే అకాడమీ--ఇంటర్నేషనల్ కోఫుకాన్ కరాటే క్లబ్ ఇండియా ఆధ్వర్యంలో పాడేరు మండలంలోని శ్రీకృష్ణాపురం, గుత్తులాపుటు పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పాండు కరాటే అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ బాకూరు పాండు రాజు మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులకు ఆత్మరక్షణ విద్యతో పాటు ధైర్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ అలవడేలా ఈ శిక్షణ దోహదపడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఎం. దీప్తిక, విద్యార్థినులు పి. జాహ్నవి, పి. భాగ్యశ్రీ పాల్గొన్నారు.

## సీనియర్ నాయకుడి పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే పాల్గుణ

**వైసిపి నేత తిరుపతి హఠాన్మరణం పార్టీకి, కుటుంబానికి తీరని లోటు.**

**అరకు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 07.**వైసీపీ సీనియర్ నాయకుడు సోనియా తిరుపతి యొక్క అంతిమయాత్రలో భాగంగా అరకు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పార్టీ కేంద్ర కార్యవర్గ సభ్యుడు చెట్టి పాల్గుణ పాల్గొని తమ పార్టీ సీనియర్ నాయకుడు తిరుపతి పై ఉన్న అభిమానంతో స్వయంగా తానే పాడెను మోసి మానవత్వాన్ని చాటుకున్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో నివాస ముంటున్న వైసిపి సీనియర్ కార్యకర్త సోనియ తిరుపతి సోమవారం గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. మరణ వార్త విన్న మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తిరుపతి యొక్క అంత్యక్రియల్లో పాల్గొని వైసీపీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి వెళ్లి తిరుపతి పార్థివదేహానికి పంచెను కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతి ఆకస్మిక మరణం పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటనీ అన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసిన నాయకుడి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తిరుపతి యొక్క దహన సంస్కారాలు నిమిత్తం ఆర్థిక సహాయం అందించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యపరిచారు. మాజీ శాసనసభ్యులు పాల్గుణతో పాటు వైసిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తడబారికి సురేష్ కుమార్ తిరుపతి యొక్క భౌతిక కాయాన్ని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెదబయలు మండల జడ్పిటిసి సభ్యుడు కూడా బొంజుబాబు, మండల వైస్ ఎంపీపీ భాగ్యవతి, వైసిపి పార్టీ మండల అధ్యక్షులు పద్మారావు, సీనియర్ నాయకులు జయదేవ్, మత్యలింగం, బాబురావు, రమేష్, గాసి రామ్, గంపరాయి సూరయ్య, మూర్తి, జగబంధు, సులేమాన్, పిత్ భస్, రామ్మూర్తి, దాసు, దశరధి, వైసిపి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పసుపులేటి నాగమణి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి ఘన సన్మానం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 7:** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరి ఓటరు నమోదు జరిగేలా కృషి చేయాలని పాడేరు నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు.మంగళవారం గూడెం కొత్తవీధి మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులకు ఎస్ఐఆర్ సర్వే నిర్వహణ, ఓటర్ల నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆమె అవగాహన కల్పించారు. ప్రతి బూత్ పరిధిలో అర్హులైన ఓటర్లు ఎవరూ మిగిలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పార్టీ కార్యకర్తలు ప్రజలకు సహకారం అందించాలని సూచించారు.అనంతరం తెదేపా మండల ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ పసుపులేటి నాగమణి ఆధ్వర్యంలో గిడ్డి ఈశ్వరిని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోత్తూరు కొండలరావు, పీఏసీఎస్ చైర్మన్ నూకరాజు, నాయకులు కంకిపాటి గిరిబాబు, దేశగిరి గోవిందరావు తదితర తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును కలిగి ఉండాలి మాజీ సర్పంచ్ పూర్ణిమ

**ఓటర్ నమోదు మరియు సవర్ణపై అవగాహన కార్యక్రమం**

**హుకుంపేట పెన్ పవర్ జూన్ 7 :**హుకుంపేట మండలం హుకుంపేట పంచాయతీ హుకుంపేట గ్రామం లో నేడు ప్రజలకు సార్ స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు ఓటర్ జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, దిద్దుబాట్లకు సంబంధించిన విధివిధానాలను వివరించడం జరిగింది.ప్రతి అర్హులైన పౌరుడు తమ పేరు ఓటర్ జాబితాలో సరిగ్గా నమోదై ఉండేలా చూసుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత అని, సార్ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా కోరడం జరిగింది. ఎటువంటి సందేహాలు ఉన్నా స్థానిక బూత్ లెవల్ అధికారులను మరియు బూత్ ఏజెంట్స్ లకు కుడా సంప్రదించవచ్చని తెలిజెయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో హుకుంపేట పంచాయతీ మాజీ సర్పంచ్ మరియు అరకు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు సమిడ. వెంకట పూర్ణిమ,ఎంపీటీసీ కొమ్మ రమ,వి ఆర్ ఓ ,బి ఎల్ ఓ రత్న కుమారి,బి ఎల్ ఓ సాయి కిరణ్, సచివాలయం స్టాఫ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ మనోజ్, డిజిటల్ అసిస్టెంట్ బాల మురళి కృష్ణ,టీడీపీ మహిళా అధ్యక్షురాలు సిడిగం సూర్య కాంతం, బి ఎల్ ఏ సన్యాసి రావ్, బి ఎల్ ఏ శివ శంకర్ ప్రసాద్ వెలుగు వి ఓ ఏ హేమ తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాన కార్యాలయం సుందరీకరణకు సిద్ధం చేయండి

- కార్యాలయంలో పలు విభాగాలు ప్రాంతాలు పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ చేతన్ గార్గ్
- నేటివ్ అరకు కాఫీ -స్వయం ఏపీ మిల్లెట్ మిక్స్ ఉత్పత్తులు,విక్రయాలకు ప్రోత్సాహం





**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూలై 7 :**జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని ఆధునిక సౌకర్యాలతో,ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలను,జీవీఎంసీ సెల్లార్ ఫ్లోర్ లో నేటివ్ అరకు కాఫీ,మిల్లెట్ మిక్స్ అవుట్లెట్లు, ఓఎన్డిసి విక్రయాలకు తగిన ఏర్పాట్లను సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పలు ప్రాంతాలను జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.సత్యవేణి, ప్రధాన ఇంజనీరు సత్యనారాయణ రాజు,డిడిహెచ్ వాసుకి లతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రధాన కార్యాలయం సెల్లార్‌లో ఉన్న పాత క్యాంటీన్‌ను సందర్శించి అందులో నేటివ్ అరకు కాఫీ, త్వరలో ప్రారంభం కాబోతున్న స్వయం ఏపీ బ్రాండ్ మిల్లెట్ మిక్స్ ఉత్పత్తుల ఔట్లెట్లు ఏర్పాటు చేసేందుకు,అలాగే సెల్లార్ ఫ్లోర్ లో క్రేచ్ ప్రాంగణంలో మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేస్తున్న హ్యాండ్ మేడ్ ఉత్పత్తులు ఆన్లైన్ లో ఓ ఎన్ డి సి ఫ్లాట్ ఫామ్ ద్వారా విక్రయించేందుకు తగిన ఏర్పాట్లు సిద్ధం చేయాలని పీవీవి సత్యనారాయణ రాజును కమిషనర్ ఆదేశించారు .

అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరాన్ని పరిశీలించిన కమిషనర్, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని సూచించారు. కార్యాలయ ఆవరణ మరింత ఆకర్షణీయంగా రూపొందించాలని ప్రధాన ఇంజనీరుకు సూచించారు.

ప్రధాన కార్యాలయం వెనుక భాగాన్ని సైతం సుందరంగా తీర్చిదిద్దాలని, పాత కౌన్సిల్ హాల్ పరిసరాలలో, కారిడార్లలో అలంకార మొక్కలు, కింది భాగంలో పచ్చదనాన్ని పెంచే మొక్కలను నాటాలని డిడిహెచ్ వాసుకిని ఆదేశించారు. కార్యాలయ ప్రాంగణాన్ని హరిత వాతావరణంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

ఈ పరిశీలనలో జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీరు గంగాధర్,ఉప కార్యనిర్వాహ క ఇంజనీరు మౌళి, ఆఫీస్ ఇన్‌చార్జి సత్యనారాయణతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటర్ నమోదు ప్రక్రియ జరగాలి.

- అర్హులందరికీ ఓటు హక్కు తప్పనిసరిగా ఉండాలి.
- జడ్పీటిసి పోతురాజు బాలయ్య.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 7.**గ్రామాల్లో జరుగుతున్న ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టాలని జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కొత్తపాలెం, బెన్నవరం, చౌడుపల్లి పంచాయతీల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సచివాలయాలను ఆయన సందర్శించారు. ?క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా ప్రక్రియ ఎలా సాగుతోందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి పౌరుడికీ ఓటు హక్కు కల్పించేలా సిబ్బంది బాధ్యతాయుతంగా, శ్రద్ధగా పనిచేయాలని ఆయన సూచించారు. అదే సమయంలో గ్రామాల్లో నమోదైన మరణాలు, శాశ్వత వలసలను పక్కాగా గుర్తించి, వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. అనంతరం చిన్నకొత్తపాలెంలో సిబ్బందితో కలిసి ఆయన స్వయంగా ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.?ఈ పర్యటనలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కంకిపాటి వీరన్నపడాల్, మండల వైకాపా యువజన నాయకుడు వండలం చంటి, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం



- ప్రత్యేక హోమం, జపాలతో పాప పరిహార ప్రార్థనలు
- శారదాపీఠాధిపతులు ఆధ్వర్యంలో హిందూ ధర్మ పరిరక్షణకు చర్యలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 7 :** సనాతన హిందూ ధర్మం, పురాణాలు, దేవతలు మరియు పవిత్ర ఇతిహాసాలపై ఇటీవల కొందరు వ్యక్తులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను విశాఖ శ్రీ శారదాపీఠం తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొంటూ, పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మానికి జరిగిన అవమానానికి పాప పరిహారార్థంగా శ్రీరామచంద్రుని పాదాలకు నమస్కరించి, 'రామతారక మంత్రం'తో ప్రత్యేక హోమం, జపం నిర్వహించినట్లు మహాస్వామి తెలిపారు. దేశంలో ధర్మ పరిరక్షణ, ప్రజలలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు వెల్లడించారు.

### రామాయణం, మహాభారతం పవిత్ర గ్రంథాలు

రామాయణం, మహాభారతం వంటి మహాకావ్యాలు భారతీయ సంస్కృతికి మూలస్తంభాలని, అలాంటి పవిత్ర గ్రంథాల్లోని పాత్రలను వక్రీకరించడం అత్యంత బాధాకరమని మహాస్వామి పేర్కొన్నారు. సీతారాముల వంటి దైవ స్వరూపాలపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం నాగరిక సమాజం అంగీకరించదని అన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల ప్రజలు భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం గొప్పతనాన్ని గుర్తించి భారతదేశానికి వస్తున్న సమయంలో ఇదే దేశంలో పుట్టిన కొందరు వ్యక్తులు హిందూ సంప్రదాయాలను అవమానించే విధంగా మాట్లాడటం విచారకరమని స్వామివారు వ్యాఖ్యానించారు. ఇటువంటి చర్యలు సమాజంలో విద్వేషాన్ని పెంచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. హిందూ సమాజ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా అనేక మఠాలు, పీఠాలు, ధార్మిక సంస్థలు నిరంతరం సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ధార్మిక విలువలు, భారతీయ సంస్కృతి పరిరక్షణలో అవి విశేష కృషి చేస్తున్నాయని చెప్పారు. హిందూ ధర్మం, దేవతలు, పవిత్ర గ్రంథాలపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మహాస్వామి ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ధర్మ పరిరక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మాన్ని అవమానించే చర్యలను యువత, పెద్దలు, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఖండించాలని మహాస్వామి పిలుపునిచ్చారు. ధార్మిక సామరస్యం, పరస్పర గౌరవం భారతీయ సంస్కృతికి మూలాధారాలని, అన్ని మతాల విశ్వాసాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన సూచించారు.

## ఏజెన్సీ ప్రాంతాల్లో మాదిగల హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు.



- చింతపల్లిలో ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం.
- పాడేరు నియోజకవర్గ అధ్యక్షుడు ఎం. ధారబాబు ఆధ్వర్యంలో ర్యాలీ.
- పాలకులను నిలదీయాలని ముమ్మిడివరపు చిన సుబ్బారావు పిలుపు.

**చింతపల్లి పెన్ పవర్ జూలై 7.**మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చింతపల్లిలో ఘనంగా జరిగాయి. ఎమ్మార్పీఎస్ పాడేరు నియోజకవర్గ అధ్యక్షుడు ఎం. ధారబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ముందుగా హనుమాన్ జంక్షన్ నుంచి పాత బస్టాండ్ వరకు భారీ మాదిగ దండోరా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కాలనీలో స్థానిక నాయకులతో కలిసి ముఖ్య అతిథులు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యులు మరియు ఉత్తరాంధ్ర జిల్లాల నూతన కమిటీ నిర్మాణాల ఇన్‌ఛార్జ్ ముమ్మిడివరపు చిన సుబ్బారావు, ఎంఎస్పి అల్లూరి జిల్లా అధ్యక్షులు మోర్తా బుచ్చిబాబుతో కలిసి ఎమ్మార్పీఎస్ దండోరా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చిన సుబ్బారావు మాట్లాడుతూ... నవయుగ అంబేద్కర్, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదినం, అలాగే దండోరా జెండా పుట్టినరోజు కూడా ఈరోజే కావడం ఎంతో విశేషమని పేర్కొన్నారు. గత 32 సంవత్సరాలుగా ఈ దండోరా జెండా ఎన్నో పోరాటాలు చేసి, పేదలకు వృద్ధాప్య, వికలాంగ పెన్షన్లతో పాటు ఆరోగ్యశ్రీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను సాధించిపెట్టిందని ఆయన గుర్తుచేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న మాదిగల దుస్థితిపై సుబ్బారావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చింతపల్లి లాంటి ఏజెన్సీ ప్రాంతాల్లో వందలాది ఏళ్లుగా జీవిస్తున్న మాదిగలకు, ఇక్కడి ప్రత్యేక చట్టాల కారణంగా రాజ్యాంగపరమైన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలు, ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు వంటి కనీస అవకాశాలకు సైతం స్థానిక మాదిగలు నోచుకోవడం లేదని, పాలకుల దృష్టిలో వారు కేవలం ఓటర్లుగా మాత్రమే మిగిలిపోయారని ఆయన మండిపడ్డారు. ఈ సమస్యల పరిష్కారానికి అసెంబ్లీ, పార్లమెంటు వేదికగా గళం విప్పగలిగే సత్తా కేవలం మంద కృష్ణ మాదిగకు మాత్రమే ఉందని స్పష్టం చేసిన సుబ్బారావు, మాదిగల హక్కుల కోసం త్వరలోనే ఆయనను చింతపల్లికి తీసుకువస్తామని ప్రకటించారు. అల్లూరి, పార్వతీపురం తదితర ఏజెన్సీ జిల్లాల్లోని ప్రతి గ్రామంలో నల్ల జెండాతో దండోరా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఏళ్ల తరబడిగా మాకు రావలసిన ప్రభుత్వ పథకాలు ఎందుకు అందడం లేదని స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లను ముక్తకంఠంతో నిలదీయాలని నాయకులకు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. మంద కృష్ణ మాదిగ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లి, సమాజంలోని అన్ని వర్గాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి అరకు పార్లమెంట్ గౌరవ అధ్యక్షులు కుందూరు రాజు, ఎమ్మార్పీఎస్, స్థానిక ఎంపీటీసీ, ఎంఎస్పి నాయకురాలు చిందాడ జయలక్ష్మి, ఎంజిఎఫ్జిల్లా అధ్యక్షులు కుందూరు అప్పలరాజు, ఎంఎస్పి చెందాడ చిన్న అప్పారావు చిన్న ఎమ్మార్పీఎస్ మహిళ నాయకురాలు చిందడ అపర్ణ, ఎమ్మార్పీఎస్ సమైక్య మహిళా నాయకురాలు చిందాడ రాజు, చింతపల్లి మండల అధ్యక్షులు పెదపూడి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఉప్పాడ చిన్నప్పారావు, ఎం ఎస్ పి ప్రధాన కార్యదర్శి కుందూరు వెంకట్రావు,మండల ప్రెసిడెంట్ ఎమ్మెస్ పి చిందాడ అప్పారావు, , మహిళా సమైక్య నాయకురాలు సలికి కుమారి, నాయకురాలు గడ్డం సోమరాజు, గజ్జలపు సాయి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

ప్రత్యేక శిక్షణ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ నిశాంతి టి.



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు/ గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 7:**భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంతి టి. సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అమరావతి నుంచి అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, కడప, కర్నూలు, ఎన్టీఆర్ తదితర జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించి, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంతి టి. ఆధ్వర్యంలో తహసీల్దార్లు, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌వోలు), మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు)తో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సంబంధిత అధికారులు, సిబ్బందికి ప్రత్యేక ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఫారాన్ని జాగ్రత్తగా పరిశీలించి డేటా నమోదు చేయాలని, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేందుకు డిజిటలైజేషన్ కీలకమని ఆమె పేర్కొన్నారు.

## ఆశ వర్కర్లకు 26వేలు వేతనాలు చెల్లించాలి

- ఆశ కార్యకర్తలకు, సిహెచ్ డబ్ల్యూలకు పని భారం తగ్గించాలి.
- జూలై 31న జిల్లా కలెక్టరేట్లో జరిగే ధర్నాకు తరలిరండి.
- సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 07.**ఆశ వర్కర్లకు, సిహెచ్ డబ్ల్యూలకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు చెల్లించాలని, పర్మినెంట్ సెలవులు, పని భారం తగ్గించాలని, జూలై 31న కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిరావాలని సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు పిలుపునిచ్చారు. మంగళవారం శంకర్ రావు ఆధ్వర్యంలో కిలగడ, లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశ కార్యకర్తలు, సిహెచ్ డబ్ల్యూలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ ఆశా వర్కర్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలో గల లబ్బూరు కిలగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న సిహెచ్ డబ్ల్యూలు, ఆశ కార్మికులతో చర్చించామని, సమస్యల పరిష్కారానికి ఈనెల 31న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని అన్నారు. సిహెచ్ డబ్ల్యులకు, ఆశ కార్యకర్తలకు సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలనీ ఆయన డిమాండ్ చేశారు. 26 మార్చి 5న ఆశ వర్కర్ సమస్యలపై చలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వం యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇతర డిమాండ్స్ త్వరలో పరిష్కరిస్తామని మినిట్స్ కాపీ అందజేశారు. నేటికి నాలుగు నెలలు దాటినప్పటికీ సమస్య పరిష్కారం పట్ల రాష్ట్ర కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంతో అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు ప్రతి ఒక్కరు కదిలి రావాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు శంకర్రావు అన్నారు. ఈ కార్యక్రమానికి ఆశ వర్కర్స్ సి ఎస్ డబ్ల్యూ, కే శాంతమ్మ, జె మా సరస్వతి, కవిత, జయసుధ, రాధ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదును వేగవంతం చేయాలి.

తెదేపా శ్రేణులకు పాడేరు ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి దిశానిర్దేశం.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 7.**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఓటరు నమోదు (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పాడేరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చింతపల్లిలోని గిరిజన భవన్‌లో మండల స్థాయి తెదేపా ముఖ్య నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లతో (బీఎల్ఏ) ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియపై కేడర్‌కు ఆమె కీలక దిశానిర్దేశం చేశారు. ?నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి బూత్‌ల వారీగా కొత్త ఓటర్ల నమోదును బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, ప్రతి పంచాయతీలో ఈ కార్యక్రమాన్ని ఉద్ధృతంగా చేపట్టాలని ఆమె ఆదేశించారు. పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ?ఈ కార్యక్రమంలో తెదేపా చింతపల్లి మండల అధ్యక్షులు పూర్ణచంద్రరావు, మాజీ అధ్యక్షులు బేర సత్యనారాయణ, పిఏసిఎస్ ఛైర్మన్ గెమ్మెలి అబ్బాయినాయుడు, ఏఎంసీ డైరెక్టర్ ఎన్.చిన్నకేశవ, సీనియర్ నాయకురాలు సేవ ఈశ్వరమ్మ పాల్గొన్నారు. అలాగే పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆంధ్రభు లక్ష్మణ్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు రాము, భీమన్న, ఐ-తెదేపా మండల అధ్యక్షులు వరికోటి మహేంద్ర, చింతపల్లి ఏఎంసి డైరెక్టర్ బేతాలుడు తదితర సీనియర్ నాయకులతో పాటు మండలంలోని 17 పంచాయతీలకు చెందిన ముఖ్య నాయకులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

# భూసారం ఎలా తెలుసుకోని విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

**పంట పొలాలలో మట్టి నమూనాల సేకరణ భూసార పరీక్షలు పై ఏకలవ్య విద్యార్థులకు అవగాహన కార్యక్రమము.**

**హుకుంపేట పెన్ పవర్ జూన్ 7.**హుకుంపేట మండలం లోగల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినిలకు జిల్లా వనరుల కేంద్రము అల్లూరి సీతారామరాజు జిల్లా మరియు వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు చేయు పద్ధతి వాటి వల్ల ఉపయోగాలు పై అవగాహన కార్యక్రమము ఏర్పాటు చేశారు ఈ మట్టి నమూనాల సేకరణ పద్ధతి, ఎప్పుడు ఎలా సేకరించాలి, కావలసిన పరికరాలు,ఏంటి నమూనా తీసే విధానం, ఏ విధంగా మట్టిని కలపాలి, ఏ విధంగా ప్యాకింగ్ చేయాలి అలాగే లేబుల్ అంటే ఏ ఏ వివరాలు సేకరించి నమోదు చేసి పంపించాలి, అవి ఎక్కడ పరీక్షించాలి అనే అంశాలను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ విద్యార్థులకు వివరించారు.

ఈ మట్టి నమనాలను పరీక్ష చేయడం వలన మట్టిలో ఏముంది ఒక పొలంలో నత్రజని భాస్వరము పొటాష్ మరియు సూక్ష్మ పోషకాలు జింక్ ఐరన్ బోరాను మరియు సల్ఫర్ వంటి పోషకాలు ఖచ్చితంగా ఎలా తెలుస్తుంది వాటి వల్ల ఉపయోగాలు ఏమిటి మరియు భూమి యొక్క ఆరోగ్యాన్ని ఏ విధంగా కాపాడుకోవాలి, వాటి యొక్క ఉపయోగాలు అంటే ఏ విధంగా ఖర్చు తగ్గించుకోవచ్చు పంట పొలాల నుంచి ఎక్కువ దిగుబడి నాణ్యమైన పంటను ఏ విధంగా సాధించుకోవచ్చు అనే అంశాలపై డి ఆర్ సి వ్యవసాయ అధికారి ఎల్ ఆర్ బి పాత్రుడు పిల్లలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మరియు డి.ఆర్.సి ఏడిఏ శ్రీ బి ప్రభాకర రావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆదిత్య యూనివర్సిటీ లో సందడి చేసిన 'లెనిన్" సినిమా టీమ్



**గండేపల్లి, పెన్ పవర్, జూలై 07:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణం లో మంగళవారం సాయంత్రం అఖిల్ అక్కినేని నటించిన లెనిన్ సినిమా టీమ్ సభ్యులు సందడి చేశారు. లెనిన్ అనేది మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో అఖిల్ అక్కినేని ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్-డ్రామా. ఇందులో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, ఎస్.ఎస్. థమన్ సంగీతం సమకూరుస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ చిత్రం జూలై 10, 2026న థియేటర్లలో విడుదలవుతోంది.సినిమా విశేషాలు దర్శకత్వం: మురళి కిషోర్ అబ్బూరు నటీనటులు: అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే, బ్రహ్మాజీ, మరియు శివాజీ సంగీతం: థమన్ బ్యానర్లు : అన్నపూర్ణ స్టూడియోస్, మన్యం ఎంటర్ప్రైజెస్, సితార ఎంటర్టైన్మెంట్స్ విడుదల తేదీ: జూలై 10, 2026 ఈ సినిమా పూర్తి స్థాయి యాక్షన్ ఎంటర్టైనర్గా తెరకెక్కింది. అఖిల్ అక్కినేని మునుపటి చిత్రాలకు భిన్నంగా, పూర్తి గా మాస్ మరియు రాయలసీమ యాసతో కూడిన పాత్రలో కనిపిస్తున్నారు. ప్రీ-రిలీజ్ ఈవెంట్స్ మరియు ట్రైలర్ల ప్రకారం, సినిమా సీమలోని రాజకీయాలు, యాక్షన్ మరియు భావోద్వేగాల మేళవింపుతో కూడిన ఒక మహాభారతం లాంటిదని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా అఖిల్ అక్కినేని విద్యార్థుల కేరింతల మధ్య మాట్లాడుతూ యువతకు, ఫ్యామిలీ ఆడియన్స్ కు నచ్చే అన్ని అంశాలు చిత్రంలో పొందుపరచడం జరిగింది అని ఎంతో ప్రేమతో కష్టపడి సినిమా చేయడం జరిగింది అన్నారు. కథానాయక భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఈ చిత్రాన్ని థియేటర్స్ లోనే చూసి ఆనందించాలని సినిమా ను ఆదరించి అఖిల్ అక్కినేని కు పెద్ద ఎత్తున విజయం అందించాలని కోరారు. తొలుత ఆదిత్యకు వచ్చిన అఖిల్ అక్కినేని కి యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్. డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి ని కలవగా సతీష్ రెడ్డి సాదర స్వాగతం పలికి శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డా.డి. కిశోర్, జగ్గంపేట సి.ఐ. తిరుపతిరావు,గండేపల్లి ఎస్.ఐ. శివ నాగుతదితరులు పాల్గొన్నారు. గండేపల్లి,పెద్దాపురం,సామర్లకోట కు చెందిన పోలీస్ సిబ్బని బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆశా వర్కర్లు ధర్నా, వినతి పత్రం అందజేత





**గండేపల్లి,పెన్ పవర్,జులై,07:**
ఏపీ ఆశా వర్కర్ల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు మండల కేంద్రమైన గండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశావర్కర్లు సిఐటియు అధ్వర్యంలో మంగళవారం పి హెచ్ సీ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఒక పక్క అత్యవసర సేవలు మరో పక్క బిఎల్ఓ సర్వేలు చేయమంటే రెండు ఒకేసారి ఎలా చేస్తామని ప్రశ్నించారు. ఆశా వర్కర్లను బిఎల్ఓ డ్యూటీల నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31 న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసిల్దారు పద్మజా కు,వైద్యాధికారి నరేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## బాణాసంచా సామాగ్రి స్వాధీనం..



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 07:** ఎటువంటి అనుమతులు లేకుండా
నివాస గృహల మధ్య నిల్వ ఉంచిన రూ.93,500లు విలువ చేసే బాణా సంచా సామాగ్రిని అంబాజీపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి
సబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాచవరం డైలీ
మార్కెట్ సమీపంలో ఉన్న మెట్లకాలనికి చెందిన గాడా ఏసుకుమార్ ఎటువంటి అనుమతులు లేకుండా బాణా సంచా తయారు చేస్తున్నాడని విశ్వసనీయ సమాచారం ద్వారా తెలిసిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు సిబ్బందితో దాడి చేసి రూ. 55,400 విలువ చేసే నల్ల మందు 120 కేజీలు, సూరేఖారం 13 కేజీలు, ఎలక్ట్రిక్ పౌడర్ 3 కేజీలు, సల్ఫర్ 10 కేజీలు, రూ. 25,199 విలువ చేసే చిన్న జువ్వలు 300, పెద్ద జువ్వలు 46, పుల్లకట్టలేని జువ్వలు 200, అవుట్లు పెద్దవి 50, చిన్న అవుట్లు 50, మిడతల దండలు 7, దీపావళి బాణా సంచ విలువ రూ. 12,910లు మొత్తం రూ. 93,500లు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు
తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పై షేక్ సుభాని తెలిపారు.

## ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**మంత్రి వాసంశెట్టి సుభాష్కు ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం**

**కాజులూరు, పెన్ పవర్, జూలై 7:** ఏపీ జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా, కాజులూరు మండలం గొల్లపాలెం యూనిట్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ను కలిసి ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు.గొల్లపాలెం యూనిట్ అధ్యక్షుడు దేవు సదానందమూర్తి నాయకత్వంలో ప్రతినిధులు మంత్రిని కలిసి, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను తీసుకెళ్లాలని కోరారు. ముఖ్యంగా పీఆర్సీ కమిషన్ను వెంటనే ఏర్పాటు చేయడం, ఐఆర్ ప్రకటించడం, పెండింగ్ డీఏలను విడుదల చేయడం, సీనియర్ సిటిజన్లైన పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించడం, పెండింగ్లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్ సానుకూలంగా స్పందిస్తూ, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి డి.వి.వి. చిన్నారావు, ట్రెజరర్ కె.వి. రామరాజు, సభ్యులు సుంకర వీరభద్రరావు, జి. నాగేశ్వరావు, చి. సత్తిరాజు, కె.వి. రమణయ్య, వి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## కే పెదపూడి లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 61 పుట్టిన రోజు వేడుక





**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 07:**మండలం కె పెదపూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, మంద రాజేష్ నేదునూరి పెద్దిరాజు ఆధ్వర్యంలో కె పెదపూడి సెంటర్ లో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి నిత్య కృషివళుడు దళిత జాతి పిత మహుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 61వ పుట్టినరోజు వేడుక, ఎమ్మార్పీ ఎస్ 32 వ ఆవిర్భావ దినోత్సవం ఘనమగా నిర్వహించారు . ముందుగా కె పెదపూడి గ్రామ దేవత రాజరాజేశ్వరి రావులమ్మ తల్లి ఆలయంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా ఆయన పేరున శ్రీ రాజరాజేశ్వరి రావులమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించినారు.అనంతరం మందకృష్ణ మాదిగ పుట్టినరోజు పురస్కరించుకుని. అమలాపురం మండలం బండారులంక గ్రామంలో గల జ్యోతి లింగ అన్నదాన భోజనశాలలో వృద్ధులకు పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ. ఇరిగేషన్ రాష్ట్ర డైరెక్టర్. శిరిగినీడి వెంకటేశ్వరరావు.అంబాజీపేట పిఎ సి ఎస్ మాజీ అధ్యక్షులు గణపతి వీరరాఘవులు. అంబాజీపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుడాల ఫణి. ప్రధాన కార్యదర్శి రవణం రాము, మండల జనసేన అధ్యక్షులు దొమ్మేటి సాయి కృష్ణ. ఇరుసుమండ సొసైటీ అధ్యక్షులు సుంకర గణపతి. సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సురేష్ కుమార్. కె పెదపూడి టీడీపీ అధ్యక్షులు తిరుమనాదం హనుమంతురావు. పెచ్చెట్టి హరిబాబు. ఉందుర్తి నాగబాబు. గొల్లకోటి నరేష్, వాసర్ల చిన్న నవ్వుంద్రు వెంకటరమణ. కముజు చిరంజీవి. రాయపు రెడ్డి సత్యనారాయణ. ఉందుర్తి పరంజ్యోతి, చిక్కం పల్లం రాజు . యర్ర తేజ శరణ్. చిక్కం ఏసు, సురవరపు సురేష్, తిరుమనాదం నాయుడు . వాసర్ల సురేష్ . పలివేల సత్యనారాయణ . దొమ్మేటికి సత్తిపండు. బల్లా బసవరాజు. బలిజేపల్లి గోపాలకృష్ణ. తిరుమనాదం రాజా. దాసరి శీను. దొమ్మటి చిట్టిబాబు చోళ్లంగి గణేష్ నుటుకుర్తి సజీవ్ కూనవరాపు రాము, పెదపూడి సురేష్, గుద్దటి శీను. కుటమి నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏకలవ్య విద్యార్థుల భవిష్యత్పై ఆందోళన కొత్తగా చేరిన విద్యార్థులకు తరగతులు ప్రారంభించాలని తల్లిదండ్రుల డిమాండ్

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలి



**జి.మాడుగుల పెన్ పవర్ జూన్ (7)** జి.మాడుగుల మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పాఠశాల ఎదుట నిరసన చేపట్టి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ విద్యాసంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులను ఇప్పటికీ పాఠశాలలో చేర్చుకుని తరగతులు ప్రారంభించలేదని ఆరోపించారు. పాఠశాలలు పునఃప్రారంభమై నెలరోజులు దాటినా తమ పిల్లలు ఇంటికే పరిమితమయ్యారని, ఏకలవ్యలో సీటు రావడంతో మంచి విద్య లభిస్తుందని ఆశించినా పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఏకలవ్య పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం గురుకుల పాఠశాల భవనంలో తాత్కాలికంగా కొనసాగుతుండడంతో సరిపడా గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఏళ్లుగా నూతన పాఠశాల భవన నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ ఇప్పటికీ పూర్తి కాలేదని విమర్శించారు.
ఇప్పటికైనా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్పందించి కొత్తగా చేరిన విద్యార్థులకు వెంటనే తరగతులు ప్రారంభించడంతో పాటు పాఠశాల భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని తల్లిదండ్రులు కోరారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ వేడుకలు

- మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసిన నాయకులు.. విద్యతోనే రిజర్వేషన్ల ఫలాలు పొందాలని పిలుపు



**విశాఖ దక్షిణం పెన్ పవర్ వ జూలై 7 :** ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఆసిల్మెట్టలో ఘనంగా నిర్వహించారు. ఈతలపాక వేణు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విశాఖ జిల్లా ఇన్చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు సమర్పించి, ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.
ఈ సందర్భంగా పేరెల్లి ఎలీషా మాదిగ మాట్లాడుతూ, రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాలుగా సాగించిన పోరాటం ఫలితంగానే 2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు ద్వారా చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని తెలిపారు. అదే సమయంలో గుండె జబ్బు పిల్లల ఉద్యమం, వికలాంగుల హక్కుల పరిరక్షణ, వృద్ధులు, వితంతువుల పెన్షన్ల పెంపు వంటి అనేక ప్రజా ఉద్యమాల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిందన్నారు.
ప్రస్తుతం చేపట్టిన 'గో టు విలేజ్' కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో మాదిగ సమాజంలో విద్యపై అవగాహన పెంచుతున్నామని తెలిపారు. రిజర్వేషన్ల ద్వారా లభించే అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలంటే పిల్లలను ఉన్నత విద్య చదివించాలని, విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
సమావేశం అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంపిణీ చేయగా, వృద్ధులకు చీరలు అందజేశారు.
కార్యక్రమంలో ఈతలపాక శ్యామ్ (చిన్ని), జోరీగల గణేష్, సవరపు జయకుమార్ మాదిగ (ఎంఎస్పీ జిల్లా నాయకులు), గంట్యాడ శ్రీను మాదిగతో పాటు పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఈతలపాక వేణు, ఈతలపాక చిన్ని, గంట్యాడ శ్రీను మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవతా స్పర్శ

- కిడ్నీ బాధితుడికి రూ.20 వేల ఆర్థిక సాయం కుటుంబానికి అండగా మంత్రి

**రామచంద్రపురం/పి. గన్నవరం, పెన్ పవర్, జూలై 7:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరం గ్రామం వేమనవారిపాలెంకు చెందిన వేమన కిరణ్ కుమార్ (నాని) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు.పి. గన్నవరంకు చెందిన తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సంసాని పెద్దిరాజు ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్, బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స వివరాలను కుటుంబ సభ్యులతో చర్చించారు. చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి ధైర్యం చెబుతూ, వ్యక్తిగతంగా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితుడికి అవసరమైన వైద్య సహాయం అందేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, అవసరమైన సమయంలో స్వయంగా వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయం అందిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ సేవలను స్థానికులు ప్రశంసించారు. ఆయన మానవతా దృక్పథంతో చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దొంగ శ్రీను, గనిశెట్టి ఈశ్వర్, వేమన రామకృష్ణ, వేమన గంగాధర్, శేరు శ్రీను, వేమన శ్రీను, వేమన సత్తిబాబు, అంబటి మణికంఠ, కామాడి రామకృష్ణ, అనిశెట్టి నరేష్, యర్రంశెట్టి చిన్న తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com